క్లుప్తంగా

డీటీగా త్రినాథ్‌రావు బాధ్యతల స్వీకరణ


డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్‌రావు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ డిప్యూటీ తహసీల్దార్‌గా ఎస్.ఎ.త్రినాథ్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో విశాఖ జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఆయన పనిచేశారు. ఏపీఐఐసీలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్‌గా ఉన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా సీతమ్మధార మండలానికి డీటీగా వచ్చారు. ఇక్కడ పనిచేసిన చేతన్‌కుమార్ మహారాణిపేట డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా కొత్త డీటీ త్రినాథ్‌రావును రెవెన్యూ సిబ్బంది అభినందించారు.

ఏపీఎస్ఎస్‌డీసీలో 'జనభాగిదారి'

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలోని జిల్లా నైపుణ్యాభివృద్ధి కార్యాలయంలో సోమవారం జనభాగిదారి కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జీ20–జన్‌భాగిదారి కార్యక్రమంలో భాగంగా విశాఖ జిల్లా కార్యాలయంలో నైపుణ్య హరితహారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్ని నైపుణ్య శిక్షణ కేంద్రాల్లో 200 మొక్కలు నాటినట్లు జిల్లా నైపుణ్యాధికారి సాయి కృష్ణచైతన్య తెలిపారు. ఈ నెల 15 వరకు మొక్కలు నాటడంతోపాటు వర్క్‌షాప్‌లు, ఎగ్జిబిషన్‌లు, సెమినార్‌లు, కాన్ఫరెన్స్‌లు జిల్లా, బ్లాక్, పంచాయతీలు, పాఠశాల స్థాయిలో విస్తృతంగా నిర్వహిస్తామని చెప్పారు.

ట్రాఫిక్ పోలీస్ బైక్‌కు కష్టాలు


ద్విచక్రవాహన చోదకుడి సపోర్ట్‌తో బైక్‌ను తీసుకెళ్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్

సీతమ్మధార: ఓ ట్రాఫిక్ పోలీస్ కానిస్టేబుల్ ద్విచక్ర వాహనానికి కష్టాలు వచ్చాయి. సోమవారం మద్దిలపాలెం నుంచి ట్రాఫిక్ కానిస్టేబుల్ ఒకరు తన బైకుపై విధులకు బయలుదేరారు. మార్గం మధ్యలో ఏదో కారణం చేత బైక్ ఒక్కసారిగా ఆగిపోయింది. ద్విచక్ర వాహనంపై వస్తున్న మరో వ్యక్తి సహాయంతో ట్రాఫిక్ పోలీస్ తన బైకుతో ముందుకుసాగారు.

పాత చలానాలు రద్దు చేయాలి

సీతమ్మధార: ఆటో డ్రైవర్లపై ఉన్న పాత చలానాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం దొండపర్తి సమీపంలోని శ్రీకన్య థియేటర్ జంక్షన్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ జిల్లాలోని ఆటో డ్రైవర్లపై ఉన్న ఈ చలానాలు రద్దు చేయాలని, పెంచిన డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ధరలను తగ్గించి జీవనోపాధి కల్పించాలని కోరారు. జీవో నంబర్లు 21, 31లను రద్దు చేసి రవాణా రంగాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో రావికృష్ణ, బి.రామారావు, శ్రీను, రమణ, రాజా, వాసు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

మురళీనగర్: ఏఎస్సార్ నగర్‌లోని కె.కాలనీ ఉన్నత పాఠశాలలో జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. స్థానిక పీడీ స్వరూపారాణి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో బాక్సింగ్, చెస్, క్యారమ్స్ ఆటల్లో 15 రోజుల పాటు శిక్షణనిచ్చారు. ముగింపు కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని సాయిలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోను పాల్గొనాలని సూచించారు. శిక్షణ శిబిరంలో నేర్చుకున్న దాన్ని ప్రతి రోజు సాధన చేయాలన్నారు. ఈ నెల 7న స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులకు మేయర్, జీవీఎంసీ కమిషనర్ల చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేస్తామని హెచ్ఎం చెప్పారు. కోచ్‌లు మల్లికార్జున, నవ్య, స్వరూపారాణి, సచివాలయ ఆరోగ్య కార్యదర్శి, ఎమినిటీస్ కార్యదర్శి, ఇతర కార్యదర్శులు పాల్గొన్నారు.

నిలువ నీడ కరువు


సీతంపేట జంక్షన్‌లో చెట్టు కింద నిరీక్షిస్తున్న ప్రయాణికులు


సీతంపేట మెయిన్ రోడ్‌లో గెడ్డ పక్కన నిరుపయోగంగా ఉన్న బస్ షెల్టర్

- స్టాపుల వద్ద కానరాని బస్ షెల్టర్లు
- కొన్ని చోట్ల ఉన్నా.. నిరుపయోగం
- మండుటెండలో ప్రయాణికుల అవస్థలు

సీతంపేట: ఈ వేసవిలో ఎండలు మండుతున్నాయి. బస్టాపుల వద్ద షెల్టర్లు లేకపోవడంతో భానుడి ప్రతాపానికి నిలువ నీడ కరువై ప్రయాణికులు విలవిలలాడుతున్నారు. ముఖ్యంగా సీతంపేట జంక్షన్‌లో బస్ షెల్టర్ లేక చెట్టు కింద నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలో బస్ షెల్టర్లు ఉన్న చోట బస్సులు ఆగవు.. అవి ఆగే చోట షెల్టర్లు ఉండవు. ఈ రోడ్డులో బీవీకే కళాశాల వద్ద రెండు బస్ షెల్టర్లు నిర్మించారు. సీతంపేట కూడలిలో బస్సులు ఆపేచోట కాకుండా గెడ్డ పక్కన షెల్టర్ నిర్మించడంతో నిరుపయోగంగా మారింది.

బీఆర్‌టీఎస్ రోడ్డులో ఇలా..

ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మద్దిలపాలెం కూడలి వరకు ఆర్టీసీ బస్సులు బీఆర్‌టీఎస్ మార్గంలో రాకపోకలు సాగించాల్సి ఉంది. దానికి అనుగుణంగా ఆ మార్గంలో బస్ షెల్టర్లు నిర్మించారు. కాంప్లెక్స్ నుంచి మద్దిలపాలెం వైపు వెళ్లే బస్సులు బీఆర్‌టీఎస్ మార్గంలో ప్రయాణించకుండా సర్వీస్ రోడ్‌లో వెళ్లడంతో బస్ షెల్టర్లు లేక స్వర్ణభారతి స్టేడియం వద్ద హెచ్‌పీ పెట్రోల్ బంకు నీడలో ప్రయాణికులు నిరీక్షిస్తున్నారు.

ఒకవైపే షెల్టర్లు..

సీతంపేట కూడలి, గురుద్వారా, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో పాలబూత్ సెంటర్, సంగం ఆఫీస్ కూడలి వద్ద ఒకవైపు మాత్రమే బస్ షెల్టర్లున్నాయి. రెండో వైపు లేవు. సంఘం ఆఫీస్ కూడలిలో ఉన్న బస్ షెల్టర్‌లో కూర్చునే సదుపాయాలు లేక జనం ఇబ్బంది పడుతున్నారు. వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ప్రయాణికులు నిరీక్షించేందుకు వీలుగా షెల్టర్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను పలువురు కోరుతున్నారు.

చెట్టు నీడే దిక్కు

సీతంపేట జంక్షన్ నుంచి ఇటు తాటిచెట్లపాలెం, కంచరపాలెం, మర్రిపాలెం, ఎన్ఏడీ, గాజువాక, కైలాసపురం, పెందుర్తి, సింహాచలం.. అటు ఆర్టీసీ కాంప్లెక్స్, జగదాంబ, పూర్ణామార్కెట్ ఇలా ఎక్కడికి వెళ్లాలన్నా సీతంపేట కూడలిలో బస్సుల కోసం నిత్యం చాలా మంది నిరీక్షిస్తుంటారు. బస్ షెల్టర్ లేక చెట్టు నీడనే ఆశ్రయిస్తూ ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి బస్ షెల్టర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– జి.రాంబాబు, సీతంపేట

బస్ షెల్టర్ అవసరం

ప్రతి రోజూ గాజువాక నుంచి బీవీకే కళాశాల వద్దకు వస్తుంటాను. సీతంపేట కూడలిలో బస్ షెల్టర్ లేకపోవడాన్ని చాలా ఏళ్ల నుంచి చూస్తున్నాను. ఇపుడు ఎండా కాలంలో చెట్టు కింద నిలబడాల్సి వస్తోంది. పెద్దవారు, వృద్ధులు, మహిళలు ఎండలో బస్సుల కోసం వేచి ఉండలేక ఆటో ఎక్కి వెళ్లిపోతున్నారు. సీతంపేట జంక్షన్‌లో బస్ షెల్టర్ నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

– కె.శైలజ, ప్రయాణికురాలు


అధికారుల దృష్టికి తీసుకెళ్తా



సీతంపేట కూడలిలో రెండు వైపులా షాపులు ఉండటం వల్ల కొద్దిగా ముందుకు గెడ్డ పక్కన ఒక షెల్టర్, బీవీకే కళాశాల ఎదురుగా రెండు షెల్టర్లు నిర్మించారు. గురుద్వారా కూడలి వద్ద హైవేకు ఆనుకొని రూ.50 లక్షలతో డిజిటల్ బస్ షెల్టర్ నిర్మిస్తున్నారు. అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాను.

– సారిపిల్లి గోవింద్, కార్పొరేటర్, 25వ వార్డు

భండాసురుని సంహారానికే లలితాదేవి అవతారం



అనుగ్రహ భాషణం చేస్తున్న శ్రీసిద్ధేశ్వరానంద మహాస్వామి


హాజరైన పండితులు, సాహితీ వేత్తలు

సీతంపేట: భండాసురుని సంహారం కోసం లలితాదేవి అవతరించిందని కుర్తాళం శంకరాచార్య, లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అన్నారు. పీఠం దర్బారు హాల్లో దశ మహావిద్యల్లో భాగంగా రెండో రోజు లలితా వైభవంపై అనుగ్రహ భాషణం చేశారు. యుద్ధం లేకుండా భండాసురుడు అన్ని లోకాల్లో కామ ప్రళయాన్ని సృష్టించాడన్నారు. దేవతలందరూ శ్రీమహావిష్ణువుని ప్రార్థించగా శంభుదేవుడి సూచనతో చేసిన మహాయజ్ఞం నుంచి లలితాదేవి ఆవిర్భవించి భండాసురుని సంహరించిందని తెలిపారు. లలితాదేవి చేసిన యుద్ధంలో మహిళా సైన్యం పాల్గొన్నదని చెబుతూ వివిధ అస్త్రాల విశేషాలను వివరించారు. లలితా సహస్ర నామం అమ్మవారు భండాసురుని ఎలా సంహరించిందో చెబుతుందన్నారు. 16 అక్షరాలతో ప్రకాశించేది లలితా మంత్రమని, దేవతల్లోనూ అందరూ అమరులు కాదని, బృహస్పతి కుమారుడు కచుడు, శుక్రుని నుంచి మృత సంజీవని విద్యను సాధించిన కథను, లలితాదేవి అవతరించిన వైనాన్ని వివరించారు. ప్రవచనానికి ముందు నిర్వహించిన సంగీత విభావరి భక్తులను అలరించింది. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని, పెద్ద సంఖ్యలో సాహితీ వేత్తలు, పండితులు, భక్తులు పాల్గొన్నారు.

లలితా పీఠానికి భక్తుల క్యూ..

లలితా పీఠానికి భక్తులు పోటెత్తుతున్నారు. లలితా పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి నాలుగు నెలల తర్వాత పీఠానికి వచ్చారు. దీంతో ఆయన దర్శనం కోసం పెద్ద ఎత్తున భక్తులు బారులు తీరుతున్నారు. జూలై 3 నుంచి సెప్టెంబర్ 29 వరకు చాతుర్మాస దీక్షలు జరగనుండటంతో.. ఏర్పాట్ల నిమిత్తం స్వామీజీ పీఠానికి విచ్చేశారు. సుమారు మూడు నెలల పాటు పీఠంలో భక్తులకు అందుబాటులో ఉంటారు. వివిధ ప్రాంతాల నుంచి స్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులను దర్బార్ హాల్లో కూర్చోబెట్టి ఒకరి తర్వాత మరొకరిని దర్శనానికి అనుమతిస్తున్నారు. పీఠం విస్తరణాధికారి మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. స్వామీజీని కలవడానికి ముందుగా అనుమతి తీసుకోవాలని ఆయన సూచించారు. .

'స్పందన'కు 20 అర్జీలు


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

సీతమ్మధార: సీతమ్మధార మండల అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 20 వినతులు అందాయి. అర్జీదారుల వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆనంద్‌కుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

25వ వార్డులో సోలార్ వెలుగులు


సోలార్ లైటును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులో సోలార్ వెలుగులు విరజిమ్మాయి. వార్డుకు మంజూరైన మూడు సోలార్ వీధి లైట్లను గణేష్‌నగర్, నాయుడు వీధి, మధురా నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయ కర్త కె.కె.రాజు సూచనల మేరకు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు సారిపిల్లి గోవింద్ సోమవారం వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్‌ను ఆదా చేసేందుకు సుమారు రూ.90 వేల జీవీఎంసీ నిధులతో, 20 వాట్స్ గల సోలార్ లైట్లను వార్డులో అమర్చినట్లు తెలిపారు. స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు సారిపిల్లి గంగరాజు, సారిపిల్లి సంతోష్, ముప్పల రాజారావు, ఇసరపు అప్పారావు, ముప్పల పాపారావు, ఏదిరి వెంకటరమణ, శెట్టి సోమయ్య, శివగణేష్ శర్మ, సచివాలయం అడ్మిన్ హరికృష్ణ పాల్గొన్నారు.

జోన్–5 ఏఎంహెచ్‌వోగా సునీల్‌కుమార్



కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వోగా డాక్టర్ ఎ.సునీల్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.రాజేష్ జోన్–3కి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణను సునీల్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. జోన్ పరిధిలో మెరుగైన పారిశుధ్యానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సెక్రటరీలు సహకరించాలని ఆయన కోరారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు


48వ వార్డులో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న కె.కె.రాజు

కంచరపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 48వ వార్డు అల్లూరి సీతారామరాజు కాలనీ, సచివాలయం 273 ఇందిరానగర్–5 ప్రాంతాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ ఆయన వెళ్లి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, కరపత్రాలు అందజేశారు. స్థానికులు సమస్యలు అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొండవాలు ప్రాంతాల్లో పర్యటించి నివాసులు సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని తెలిపారు. చంద్రబాబు అండ్ కో చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలెవరూ నమ్మడం లేదన్నారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, వైఎస్సార్‌సీపీ వార్డ్ ఇన్‌చార్జి నీలి రవి, సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి, వార్డు నాయకులు భరత్, శ్రీరామ్, కర్రి అప్పారావు, సురేష్, రాము, ఎర్ర శ్రీను, కండిపిల్లి శ్రీను, కిషోర్, ఎస్.అప్పారావు, సత్యనారాయణ, వేణు, రామ, భాష, రమణ, జీవీఎంసీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ పోల్‌పై ప్రమాదం

- చావుబతుకుల్లో ఎలక్ట్రికల్ సిబ్బంది రమణ


విద్యుత్ స్తంభంపై ప్రమాదానికి గురైన సిబ్బంది రమణ

కంచరపాలెం: కరెంట్ పోల్‌పై ఎలక్ట్రికల్ పనిచేస్తూ సిబ్బంది ఒకరు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా.. 46వ వార్డు కైలాపురం పరిధి లక్ష్మీనారాయణనగర్ జోసెఫ్ చర్చ్ రహదారిలో సోమవారం సాయంత్రం విద్యుత్ స్తంభంపై పనిచేస్తున్న ఎలక్ట్రికల్ సిబ్బంది రమణ కరెంట్ షాక్‌కు గురై చావుబతుకులతో పోరాడుతున్నాడు. కైలాపురం ఏపీఈపీడీఎల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో విద్యుత్ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ మరమ్మతులు చేస్తున్న సమయంలో వీధిలైట్లు వేసే వ్యక్తి విద్యుత్ కనెక్షన్‌కు లైన్లు కలపడంతో ప్రమాదం చోటు చేసుందని అధికారులు తెలిపారు. ఆ సమయంలో తోటి సిబ్బంది వెంటనే విద్యుత్ సరఫరా ఆఫ్ చేసి పోల్‌పై చిక్కుకున్న రమణను జాగ్రత్తగా కిందకు దించి పోర్ట్ టౌన్ పోలీస్ స్టేషన్ దరి ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. వైద్య సిబ్బంది అత్యవసర వైద్య సేవలందిస్తున్నారు. విద్యుత్ అధికారులు ఆస్పత్రికి వెళ్లి రమణ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు.

ప్రజా సమస్యలను గుర్తించేది వలంటీర్లే


సేవా పురస్కారాలు పొందిన వలంటీర్లతో కె.కె.రాజు, 49, 50, 51 వార్డుల కార్పొరేటర్లు

మర్రిపాలెం: ప్రజా సమస్యలను తక్షణం గుర్తించేది వలంటీర్లేనని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 51వ వార్డు మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో జోన్–5 ఆధ్వర్యంలో సోమవారం 48, 49, 50, 51 వార్డులకు చెందిన వలంటీర్లకు ముఖ్య అతిథిగా ఆయన సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ పేదలకు తక్షణ సహాయం అందేలా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల ముంగిట చేరేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. దీని ద్వారా రోజుల వ్యవధిలోనే పలు దీర్ఘకాలిక సమస్యలను పరిష్కారమవుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో 49, 50, 51 వార్డుల కార్పొరేటర్లు అల్లు శంకరరావు, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, పార్టీ 48వ వార్డు ఇన్‌చార్జి నీలి రవి, పి.సునీత, డైరెక్టర్లు ఎస్.రవికుమార్, పైడి శ్రీను, ఐ.రవికుమార్, జేసీఎస్ మండల కన్వీనర్ కృష్ణారావు మాస్టర్, ఏపీడీ శైలజ, సీనియర్ నాయకులు భగాతి విజయ్‌కుమార్, కర్రి రామారెడ్డి, పైడి ప్రతాప్, ఆదిరెడ్డి శ్రీను, చంద్రమౌళి, పాతపట్నం రామ్మోహన్, పొన్నాడ అప్పారావు మాస్టర్, తిరుమలరావు, షేక్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన సమస్యల పరిష్కారం


వినతులు పరిశీలిస్తున్న జెడీసీ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 03 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్‌కు 01, రెవెన్యూ విభాగానికి 02 చొప్పున వినతులు అందినట్లు జెడీసీ తెలిపారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్–1 టీఎస్ఎన్ రాజు, సూపరింటెండెంట్–2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు శ్రీనివాస్‌రావు, టి.ప్రసన్నరెడ్డి, వాటర్ వర్క్స్ ఈఈ–2 సూరిశెట్టి శేఖర్, డీఈ శ్రీనివాసవర్మ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఐ.వి.రమణమూర్తి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, సూపర్‌వైజర్ జనార్దన్, సచివాలయ అడ్మిన్లు పాల్గొన్నారు.

పర్యావరణ హితంగా జీవిద్దాం


మొక్కలు అందిస్తున్న హాస్పిటల్ డైరెక్టర్ రమేష్


రైల్వే కాలనీలో మొక్కలు నాటుతున్న ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి

సీతంపేట: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శంకరమఠం రోడ్డులోని వీ డెంటల్ హాస్పిటల్ వారు సోమవారం 500 ఇండోర్ ప్లాంట్స్, వేపతో తయారు చేసిన టూత్ బ్రష్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్ మాట్లాడుతూ ప్రజారోగ్యం ప్రకృతిపై ఆధారపడి ఉందన్నారు. మన జీవన విధానం పర్యావరణ హితంగా ఉండాలన్నారు. ఇంట్లో, పని చేసే చోట్ల ఇండోర్‌ప్లాంట్స్ పెంచడం వల్ల కలిగే ప్రయోజనాల ను వివరించారు. శంకరమఠం, లలితానగర్, మధురానగర్, శాంతపురం ప్రాంతాలకు చెందిన మహిళలకు మొక్కలు, టూత్ బ్రష్‌లను వైద్యులు రవికుమార్, అమృత, మేనేజర్ సిహెచ్.పార్వతి, కె.రమ్య, సిహెచ్.కృష్ణ, మేరి, ధరణి, వరలక్ష్మి తదితరులు అందజేశారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

మురళీనగర్: మానవాళి మనుగడకు పర్యావరణాన్ని కాపాడుకుందామని వక్తలు పిలుపునిచ్చారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ పార్కులో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యాన్ని వివరించారు. క్లబ్ పూర్వ అధ్యక్షుడు నిమ్మగడ్డ బుచ్చయ్య సమకూర్చిన 300 బెస్ట్ క్వాలిటీ క్లాత్ బ్యాగ్‌లు, అరవల రమణమూర్తి, అరుణ దంపతులు సమకూర్చిన మట్టి కుండీలతో కూడిన పర్యావరణ హితమైన మొక్కలను స్థానికులకు పంపిణీ చేశారు. దాతలను దుశ్శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. క్లబ్ కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్, కోశాధికారి జనపరెడ్డి కూర్మారావు, ఉపాధ్యక్షులు ఆదిభట్ల రామకృష్ణ, మళ్ల రామకృష్ణ, జాలీ వాకర్ ప్రకాశరావు, సంయుక్త కార్యదర్శి సనపల సీతారామకృష్ణ, కార్యవర్గ సభ్యులు టి.వెంకటరమణ, వడ్డాది అప్పారావు, పి.చెల్వరాజు, ఎం.ఎస్.ఆర్.మూర్తి, యడ్ల దేముడు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కాలేజీలో..

కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రాంగణంలో ప్రిన్సిపాల్ కేడీపీ నరసింహారావు మొక్కలు నాటారు. మెటలర్జీ విభాగం హెడ్ డాక్టర్ కె.రత్నకుమార్, సివిల్ హెడ్ ఎ.రాజేంద్రప్రసాద్, మెకానికల్ హెడ్ మధుకుమార్, జనరల్ హెడ్ డాక్టర్ పీఎం బాషా, ఫార్మసీ హెడ్ జె.గోవర్ధన్ పాల్గొన్నారు.

- మురళీనగర్ గ్రంథాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. లైబ్రేరియన్ వై.పద్మజ, పాఠకులు పాల్గొన్నారు.

ఈకార్వో ఆధ్వర్యంలో..

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (ఈకార్వో) వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో సోమవారం వాల్తేర్ డివిజన్‌లో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి నేతృత్వంలో పచ్చదనాన్ని పెంచి పర్యావరణాన్ని పరిరక్షించేందుకుగాను పలు రైల్వే కాలనీలు, రైల్వే స్టేషన్లు, పార్క్‌ల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటుతూ పర్యావరణాన్ని సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఈకార్వో ప్రతినిధులు, సభ్యులు, డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

విశాఖ పోర్టులో..

విశాఖపట్నం: నగరంలో విశాఖపట్నం పోర్టు అథారిటీ నుంచి ప్లాస్టిక్ కాలుష్యంతోపాటు గాలి, నీరు, ధూళి కాలుష్యం లేకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు వీపీఏ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే తెలిపారు. పర్యావరణ దినోత్సవాన్ని విశాఖ పోర్టులో ఘనంగా నిర్వహించారు. పోర్టు పరిపాలన భవనంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దూబే మాట్లాడుతూ ×బీట్ ద ప్లాస్టిక్ – సొల్యూషన్ టు ది ప్లాస్టిక్ పొల్యూషన్× అనే థీమ్‌తో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విశాఖ పోర్టు అధికారులు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, ఇదే విషయాన్ని ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని సూచించారు. పోర్టు పరిపాలనా భవనంలో అధికారులు మొక్కలు నాటారు. పోర్టు చీఫ్ విజిలెన్స్ అధికారి పీఎస్ఎల్ స్వామి, పర్యావరణ కమిటీ మెంబర్ బీఎల్ శాస్త్రి, చీఫ్ ఇంజినీర్ వేణుప్రసాద్ పాల్గొన్నారు.


గుడ్డ సంచులు, మొక్కలను ప్రదర్శిస్తున్న మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు


పాలిటెక్నిక్ కాలేజీలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

రైలు ప్రమాద మృతులకు నివాళి


నివాళులర్పిస్తున్న సీఐటీయూ, ఐద్వా ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి సీఐటీయూ, ఐద్వా సంయుక్తంగా విశాఖ రైల్వేస్టేషన్ వద్ద ఘనంగా నివాళులర్పించారు. స్టేషన్ మెయిన్ గేట్ వద్ద సోమవారం సాయంత్రం కొవ్వొత్తులతో సంతాపం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. సామాన్యులు, ప్రయాణికుల బాధలు పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు ప్రాధాన్యమిస్తోందన్నారు. ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి, కె.వేణు, సుమిత్ర, పుష్ప, భారతి మాదురి, సిటు నాయకులు పి.వెంకటరెడ్డి, జ్యోతేశ్వరరావు, సీత, శ్రీరాములు, కామేశ్వరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

మురళీనగర్: ఒడిశా రైలు ప్రమాద మృతులకు మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు సంతాపం తెలిపారు. వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ అధ్యక్షతన మురళీనగర్‌లో కొవ్వొత్తులు వెలిగించి వారి ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వి.ప్రభాశర్మ, రోజారాణి, సభ్యులు పాల్గొన్నారు.